# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందాలంటే బ్యాంకర్ల పాత్ర కీలకమని కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**

2. **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నాయని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు.**

3. **వెలిగొండ ప్రాజెక్టును 2026 జూన్ నాటికి పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.**

4. **మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తుందని ఆంధ్రప్రదేశ్ రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి చెప్పారు.**

5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 129వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందాలంటే బ్యాంకర్ల పాత్ర కీలకమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ రంగ బ్యాంకులతోపాటు, ప్రైవేటు బ్యాంకులు రుణాలు అందించాలని అన్నారు. జిల్లా బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశం గుంటూరులోని కలెక్టరేట్లో నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరం కంటే ప్రస్తుతం జిల్లాలో ప్రభుత్వ పథకాలకు రుణాల మంజూరు మెరుగైందన్నారు. ఈ విషయంలో ప్రైవేటు బ్యాంకులు మాత్రం వెనకబడ్డాయని పేర్కొంటూ..

వాయిస్...36 సెకన్లు .

-------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో 23 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ సెంటర్ ను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన నిన్న

ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు.

---------------------------

వెలిగొండ ప్రాజెక్టును 2026 జూన్ నాటికి పూర్తి చేసి, వచ్చే ఖరీఫ్ సీజన్ కు నీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టుపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి దృశ్యమాధ్యమ సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. వచ్చే జూన్ నాటికి టన్నెల్ లైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సీజన్ మొదలయ్యే నాటికి పనులన్నీ పూర్తవ్వాలని తెలిపారు. టన్నెల్–2లో మిగిలిన లైనింగ్ పనులు పూర్తి చేయాలని అందుకనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పనులు చేయాలని ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలకు 2029 నాటికి సొంత ఇంటి కల నెరవేరుస్తామని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజవర్గ కేంద్రంలో 607 మంది లబ్ధిదారులకు నివాస స్థల ధృవీకరణ ప్రతాలను ఆమె నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణం కోసం పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందుకు అవసరమైన చర్యలను చేపట్టిందని చెప్పారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తుందని ఆంధ్రప్రదేశ్ రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా, బనగానపల్లె పట్టణంలో వివిధ అభివృద్ధి పనులను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజవర్గంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు సంబంధించి 739 పనులను 166 కోట్ల రూపాయలతో చేపట్టడం జరిగిందన్నారు. వివిధ గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, పక్కా డ్రైయిన్ల నిర్మాణ పనులు పంచాయతీ రాజ్ శాఖ నుంచి చేపట్టినట్లు మంత్రి పేర్కొంటూ...

వాయిస్.. 36 సెకన్లు

---------------------------

దేశ అభివృద్ధి ప్రయాణంలో 2025 సంవత్సరం ఒక నిర్వచనాత్మక అధ్యాయంగా నిలుస్తుంది. ‘సంస్కరణల సంవత్సరం’ నిలిచిన ఈ ఏడాది కాలంలో పన్నుల రంగంలో దేశం సాధించిన పురోగతి గురించి ఆకాశవాణి అందిస్తున్న కథనం.. గత 8 ఏళ్లుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పన్ను సంస్కరణలు.. 2025లో కీలక మార్పును సంతరించుకున్నాయి. 2017లో వస్తు సేవల పన్ను- %+ూ% ప్రవేశపెట్టడంతో పన్నుల రంగంలో సంస్కరణలకు నాంది పలికినప్పటికీ, బహుళ స్లాబ్‌లు, వర్గీకరణ సమస్యలు నెలకొన్నాయి. ఈ ఏడాది, బహుళ స్లాబ్ లను కుదించి 5, 18 శాతంతో రెండు ప్రధాన స్లాబ్‌లుగా హేతుబద్ధీకరించారు. కొన్ని వస్తువులను జిఎస్టీ నుంచి మినహాయించారు. దీంతో వినియోదారులపై పన్ను భారం

కొంత మేర తగ్గడంతో పన్నుల రంగంలో చేపట్టిన ఈ తరువాతి తరం జివిస్టి సంస్కరణపై దేశ వ్యాప్తంగా ప్రజల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది.

---------------------------

దేశ భక్తిని రగిలింపజేసి, భారత మాతకు మనసారా వందనం చేయాలనిపించే దేశ జాతీయగీతం "జనగణమన" గీతాన్ని తొలిసారిగా ఆలపించి ఈ రోజుతో 114 సంవత్సరాల పూర్తయ్యాయి. 1911 డిసెంబర్ 27న కోల్కతాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ఈ గీతాన్ని ఆలపించారు. విశ్వకవి, సాహిత్యనోబెల్ పురస్కారగ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ కలంనుండి జాలువారిన ఈ గీతం వింటుంటే మాతృభూమి పవిత్రతను గుర్తుకు తెస్తుంది. 1950 జనవరి 24వ తేదీన భారత రాజ్యాంగసభ జనగణమనను దేశ జాతీయగీతంగా స్వీకరించింది. ఈ సందర్భంగా ఆ మహనీయుని గళం నుంచి జాలువారిన గీతాలాపాన్ని విందాం...

వాయిస్ ...35 సెకన్లు

---------------------------

కేరళ రాజధాని తిరువనంతపురంలో భారత్, శ్రీలంక మహిళల క్రికెట్ జట్ల మధ్య నిన్న జరిగిన 3వ టీ20 మ్యాచ్ లో భారత్ జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0 తేడాతో సిరీస్ ను భారత్ జట్టు కైవసం చేసుకుంది. టాస్ గెలిసిన భారత జట్టు తొలుత ఫీల్డింగ్ ను ఎంచుకుంది. దీంతో తొలత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ జట్టు 13.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, యానాం, దక్షిణ కోస్తాల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎల్. వెంకట్రావు పేర్కొన్నారు.

మరోవైపు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతుంది. ఏజన్సీ, ఇతర ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు 5 నుంచి 15 డిగ్రీలలోపు నమోదవుతున్నాయి. తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అక్కడక్కడా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకూ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

=====================